క్లుప్తంగా

ఎంటీఎస్ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



వేంనరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రెడ్డెబోయిన నాగరాజు

నాగారం : తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న అవర్లీ బేస్డ్ ఉపాధ్యాయులను మినిమం టైం స్కేలు (ఎంటీఎస్) ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డెబోయిన నాగరాజు సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోడల్‌స్కూల్స్‌లో గత 9ఏళ్లుగా తక్కువ వేతనాలతో అవర్లీబేస్డ్ ఉపాధ్యాయులుగా అంకిత భావంతో పనిచేసి విద్యార్థుల పురోభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవర్లీ బేస్డ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని మినిమం టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించిందని తెలిపారు. తెలంగాణలో కూడా అవర్లీ బేస్డ్ ఉపాధ్యాయులను ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా గుర్తించాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేల్పుచర్లలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోపి

అర్వపల్లి : వేల్పుచర్ల గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను సోమవారం ఎంపీడీఓ టి.గోపి పరిశీలించారు. వేసవికాలం మొదలైనందున కూలీలు పనులను ఉదయం, సాయంత్రం వేళల్లో చేయాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

భానుపురి : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ ప్రైవేటు వ్యక్తి రైతులు, వ్యాపారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని సూర్యాపేట పట్టణ పోలీసులకు సోమవారం పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ప్రతి సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులోని పశువుల సంతలో రైతులు, వ్యాపారులు పశువులను కొనుగోలు చేసి మార్కెట్ అధికారులకు రుసుం చెల్లించి పశువులను వాహనాల్లో తరలిస్తుంటారు. అయితే కోదాడ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పశువులను తరలించే వాహనాల వద్ద కొద్ది రోజులుగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. సోమవారం జరిగిన సంతలో కూడా ఇదే విధంగా సదరు వ్యక్తి డబ్బులు డిమాండ్ చేయడంతో ఆగ్రహించిన పలువురు రైతులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కౌలు రైతుల సమస్యలు తీర్చకుంటే ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పశ్య పద్మ

కోదాడరూరల్ : ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో గల ఎల్ఐసీ ఏజెంట్ భవన్‌లో నిర్వహించిన కౌలు రైతుల సంఘం నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించిన ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించకపోవడంతో రైతు భరోసా, రుణమాఫీ, పంట బీమా, బోనస్ వంటి పథకాలు వారికి అందకుండా పోతున్నాయని అన్నారు. ఈ నెల 10న దేశవ్యాప్తంగా జరిగే రైతు సంఘాల ధర్నాను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అంతకు ముందు కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణతో కలిసి రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్, కంబాల శ్రీను, దొడ్డా వెంకటయ్య, బెజవాడ వెంకటయ్య పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మోతె : నామవరం, రావిపహాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు అన్నారిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు ఉన్నం సత్యనారాయణరావు సోమవారం పరీక్షప్యాడ్లు, కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.10 వేలు పోత్సాహకం ఇస్తానని ప్రకటించారు.

మూలమలుపులు.. కంపచెట్లు



నాగారం-తుంగతుర్తి రహదారిపై పసునూర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు



మూలమలుపుల వద్ద కంపచెట్లతో ప్రమాదకరంగా ఉన్న మామిడిపల్లికి వెళ్లే దారి

- రోడ్ల వెంబడి కమ్మేస్తున్న ముళ్ల పొదలు
- మూలమలుపుల్లో దారి కనిపించక పొంచివున్న ప్రమాదం
- సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు

నాగారం : నాగారం-తుంగతుర్తి ప్రధాన రహదారిపై, మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా కంపచెట్ల పెరిగి ప్రమాదకరంగా మారాయి. మూల మలుపుల వద్ద కంపచెట్లు అల్లుకొని దారులు మూసేస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పసునూర్, పస్తాల, మామిడిపల్లి, మాచిరెడ్డిపల్లి, ఫణిగిరి తదితర గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్ల వెంట కంపచెట్లు ఇరువైపులా అల్లుకొని ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పసునూర్-పస్తాల మధ్య మెటల్‌రోడ్డు దారిగుండా మోడల్ స్కూల్ విద్యార్థులు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ దారిలో కంపచెట్లు విపరీతంగా ఉండటంతోపాటు విషపురుగులు కూడా సంచరిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గ్రామాల్లో మూలమలుపుల వద్ద ఎక్కడ కూడా సూచిక, హెచ్చరిక బోర్డులు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ప్రమాదకంగా ఉన్న కంపచెట్లను తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కంపచెట్లను తొలగించాలి



పస్తాల, పసునూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా సర్కార్ చెట్లు అల్లుకొని ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడంలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పసునూర్ నుంచి పస్తాలకు సుమారు 150 మంది విద్యార్థులు కంపదారి నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పెరిగిన కంపచెట్లతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్ల వెంట ఉన్న కంపచెట్లను తొలగించాలి.

– బొజ్జ సైదులు, పస్తాల

ధ్వజ స్తంభానికే విశేష ప్రాముఖ్యత



ధ్వజ స్తంభం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న పీఠాధిపతి

సూర్యాపేటటౌన్ : దేవాలయ నిర్మాణాల్లో ధ్వజ స్తంభానికే విశేష ప్రాముఖ్యత ఉంటుందని శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీ విద్యా శంకర భారతి మహాస్వామి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో నూతన జీవ ధ్వజ పునర్ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని భక్తులనుదేశించి మాట్లాడారు. మనం ఒక్కరమే భగవాన్ నామ స్మరణ చేయడం కాకుండా పదిమందితో నామస్మరణ చేయించిన రోజునే హిందూ ధర్మాన్ని కాపాడుకోగలుగుతామని తెలిపారు. భగవంతుడు తన శక్తినంత ధ్వజంలో లీనం చేస్తాడని, అందుకే ధ్వజస్తంభాన్ని పూజించిన తరువాతనే భగవంతుడిని దర్శించుకోవాలన్నారు. ఉదయం 10 గంటల ఐదు నిమిషాలకు స్వామి యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు శాంతి కల్యాణం నిర్వహించారు. వేడుకలో ఏఐసీసీ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పరిపాలిత దేవాలయాల ధర్మాధికారి ఎంఎల్ఆర్ గుప్తా స్వామి, జీపీఏ మాజీ పోలీసు అధికారి పానుగంటి చంద్రమౌళి, వేద పండితులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ, దేవాలయం అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ ఫీజుల వసూళ్లను అరికట్టాలి



డీఐఈఓ భానూనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి

భానుపురి : అక్రమ ఫీజుల వసూళ్లను అరికట్టాలని, ఫీజుల కోసం హాల్ టికెట్స్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న కార్పొరేట్ నారాయణ, ప్రైవేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి కోరారు. సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఐఈఓ భానూ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫీజులు చెల్లించలేదని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్రారంభమయ్యే సమయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్స్ ఇవ్వడం లేదని అన్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇలాంటి కళాశాలలపైన అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించనందున విద్యార్థులు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే మొత్తం బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, మహేష్, నవీన్, పవన్, వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీ

- టీచర్ల గైర్హాజరుపై ఆగ్రహం
- ఉన్నతాధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు



గిరిజన గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే పాఠశాలలో ప్రార్థన జరుగుతున్న సమయంలో 36 మంది టీచర్లు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే హాజరుకావడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అలాగే పాఠశాలలోని రికార్డులను, ఉదయం విద్యార్థులకు అందించే కిచిడీని పరిశీలించారు. కిచిడీ నాణ్యతగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను సక్రమంగా నిర్వహించవలసిన ప్రిన్సిపాలే విధులకు సక్రమంగా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గురుకులాన్ని సందర్శించిన ఆర్సీఓ

మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే మందుల సామేల్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గిరిజన గురుకులాల ఆర్సీఓ శంకర్ నాయక్ సోమవారం ఆ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను, మెనూ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

అర్వపల్లి : రామన్నగూడెం గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులు నిధుల లేమితో కొంతకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. అయితే సోమవారం ఈ విషయమై గ్రామస్తులు తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సామేల్‌ను కలిశారు. నిలిచిపోయిన పనులు పూర్తి చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో స్పందించి ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వజ్జె వీరయ్యయాదవ్, దోరేపల్లి మధు, రమావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 20లక్షలు

జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం నుంచి మూసీనది ఏటి ఒడ్డున ఉన్న గంగదేవమ్మ దేవత ఆలయం వరకు రూ. 20లక్షలతో సీసీరోడ్డు నిర్మించనున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రకటించారు. సోమవారం జాజిరెడ్డిగూడెం ముదిరాజ్ సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సామేల్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, తాటిపాముల జలేందర్, సైదుల కిరణ్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం అభినందనీయం

పెన్‌పహాడ్ : పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల భాగస్వామ్యం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు నరసయ్య, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకన్న అన్నారు. సోమవారం దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పందిరి వీరస్వామి-రేణుక దంపతులు పాఠశాల గోడలపై అమ్మ ఒడి బొమ్మను వేయించడానికి రూ. 2వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయికింది వెంకటేశ్వర్లు, ఎక్కలూరి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని ఇవ్వాలి

తుంగతుర్తి : తుంగతుర్తి రైతులకు ఏప్రిల్ నెలాఖరు వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కాల్వల ద్వారా నీళ్లు ఇస్తుందని ఆశపడి వరి సాగుచేస్తే నీరందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి ఏప్రిల్ నెలాఖరు వరకు నీళ్లు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు కదారి దేవదాసు, కొండగడుపుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

గంగదేవమ్మ ఉత్సవం



మాచిరెడ్డిపల్లిలో గంగదేవమ్మ ఉత్సవంలో భాగంగా గంగాదీపం మోసుకెళ్తున్న యాదవులు

నాగారం : నాగారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో యాదవులు సోమవారం గంగాదేవమ్మ తల్లి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంగాదేవమ్మ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు భజనలు, కోలాటాలతో గంగా దీపంను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చే మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమలో యాదవులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ ఎస్ఐ నీలిమ



తిరుమలగిరి : కన్నారెడ్డికుంట తండాలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : సైబర్ నేరాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సీహెచ్ బాలకృష్ణ, సూర్యాపేట షీ టీమ్స్ ఎస్ఐ నీలిమ కోరారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం షీ టీమ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన తదితర అంశాలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సైబర్ మోసాలకు గురికావద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలను ఇతరులకు చెప్పవద్దని కోరారు. సైబర్ మోసాలపై 1930, వేధింపులపై 100 టోల్‌ఫ్రీ నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వ్యక్తిగత ఫొటోలను వాట్సప్ డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని ఎవరైనా భంగపరిస్తే 8712686056 సెల్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, పీడీ పి. మల్లేష్, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, కృష్ణ, చారి, ఏఎస్ఐ రాములు, సిబ్బంది శ్రీను, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం కన్నారెడ్డికుంట తండా గ్రామ పంచాయతీలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో మంగళవారం గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత గంజాయి, డ్రగ్స్, మత్తుకు బానిసలు కావొద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కేతిరెడ్డి మంగ, ఏఎన్ఎం ఝాన్సీ, ప్రవళిక, కళా బృందం సభ్యులు సైదులు, ఉదయ్, నాగరాజు, శంకర్, ఉపేందర్, శ్రీను, మంజుల, రాధ, స్రవంతి, శిరీష పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మెమొరాండం అందజేస్తున్న నాయకులు

భానుపురి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంటా నాగయ్య, జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్ అన్నారు. సోమవారం ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు 18 సమస్యలతో కూడిన మెమొరాండంను అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, దాసరి శ్రీనివాస్, సీహెచ్ అంజయ్య, కొండేటి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అర్వపల్లి : ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని సూర్యాపేట, కోదాడ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్‌ల ఇన్‌చార్జ్‌లు ఎస్. గోవర్ధనగిరి, డాక్టర్ రామారావు తెలిపారు. అర్వపల్లిలో 3రోజుల పాటు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్రమిషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత యోగా-ధ్యానోత్సవాలను సోమవారం రాత్రి స్థానిక ధ్యాన కేంద్రంలో ప్రారంభించి మాట్లాడారు. ధ్యానంతో ఒత్తిడిల నుంచి ఉపశమనం పొందుతూ చక్కటి ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలన్నారు. ఈ సందర్భంగా యోగా, ధ్యానం చేయించారు. ఉచిత శిక్షణ బుధవారం వరకు జరుగుతుందని, ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రశిక్షకులు ఎంపీ రంగారావు, ఉపేందర్, సందీప్, అభ్యాసకులు, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



ఈటూరు ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



విజయనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో..

నాగారం : మండల పరిధిలోని ఈటూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల పాత్రలను పోషించి ఆకట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సోమలక్ష్మి, ఉపాధ్యాయులు సాలయ్య, నాగు, మహేష్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో..

మండల పరిధిలోని నాగారంబంగ్లా ఆవాసం విజయనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధుల, అధికారుల, ఉపాధ్యాయుల పాత్రలను పోషించి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమమహేశ్వరి, ఉపాధ్యాయులు జి.కమల, బాషా, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం అందజేత



సలీమాకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

నూతనకల్ : మండల పరిధిలోని గుండ్లసింగారం గ్రామానికి చెందిన సలీమా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సలీమాకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ. 50వేలతో పాటు రూ. 25వేలు తన సొంతంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సలీమా కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి పిల్లల చదువులకు తనవంతుగా సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, చురుకంటి చంద్రారెడ్డి, పాల్వాయి నాగరాజు, పన్నాల మల్లారెడ్డి, కొల్లు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాజీ సర్పంచ్ జటంగి వెంకటేశ్వర్లు యాదవ్ గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని సూర్యాపేట శ్రీక్రిష్ణ ట్రస్ట్ బోర్డు సభ్యులు సోమవారం పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ క్రిష్ణ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్, పెద్దగట్టు చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్యాద సైదులు యాదవ్, మాజీ జెడ్పీటీసీ సుంకరబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గొట్టెటి సైదులు, బడుగుల శ్రీనివాస్ యాదవ్, తూము వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన కొణతం సైదులు ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో గ్రామానికి చెందిన తాళ్లసింగారం జెడ్పీహెచ్ఎస్ 1999–2000 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు తమ తోటి స్నేహితుడి కుటుంబానికి సోమవారం రూ.18వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్, బిక్కి కనకయ్య, జటంగి గురువయ్య, గెండల శ్రీను, గుండెపురి వెంకన్న, సీహెచ్. వెంకటేశ్వర్లు, డి. రాములు, బి. అంజయ్య, ఎస్. రమేష్, కె. జయమ్మ, తండు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీ క్రిష్ణ ట్రస్ట్ బోర్డు సభ్యులు



అర్వపల్లి : కోడూరులో స్నేహితుడి కూతురుకు ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

కళాకారులకు డప్పులు బహూకరణ



డప్పులు బహూకరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నాగారం : నాగారం మండల పరిధిలోని మామిడిపల్లిలో మరియా ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ పేరాల ప్రవీణ్ డప్పు కళా బృందం సభ్యులకు సోమవారం డప్పులను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన తల్లి పేరాల మరియమ్మ మామిడిపల్లి గ్రామంలో ఆశా కార్యకర్తగా ప్రజలకు సేవలందించి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిందని, ఈ ఆశ ఫౌండేషన్‌ను ప్రజా సేవే లక్ష్యంగా తన తల్లి మరియమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజాసేవకు మరియా ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. అనంతరం 14 మంది డప్పు కళాకారులకు రూ.10వేల విలువ గల డప్పులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మరియా ఆశ ఫౌండేషన్ అధ్యక్షులు పేరాల సునీతశ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ఈశ్వర్, కోశాధికారి పేరాల వీరేష్, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

రజనీకాంత్ ఆచార్యులుకు విశ్వశాంతి ఉగాది పురస్కారం




పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ అర్చకుడు చింతపట్నం రజనీకాంత్ ఆచార్యులుకు జాతీయ స్థాయి విశ్వశాంతి ఉగాది పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని శ్రీ ఆర్యాణిసకల కళా వేదికలో జరిగిన కార్యక్రమంలో రజనీకాంత్‌కు కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దూపాక శ్రీధర్ బంగారు పతకం, చేతికి స్వర్ణ కంకణం, బుద్ధుడి విగ్రహం, మెమొంటో, ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో సన్మానించారు. అర్చక, జ్యోతిష్య, సాహితీ రంగాల్లో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి తనకు పోత్సాహకంగా ఈ పురస్కారం అందించినట్లు రజనీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా చిలుకూరు గ్రామస్తులు, దేవాలయం కమిటీ సభ్యులు ఆయనను అభినందించారు.

అందుబాటులో యూరియా

అర్వపల్లి : యూరియా కొరతను తీర్చడానికి మండల వ్యవసాయశాఖ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. పీఏసీఎస్‌లతో పా టు దుకాణాలలో రైతులకు అందుబాటులో యూరియా ఉండేలా తగు నిల్వలు తెప్పిస్తున్నారు. సోమవారం తిమ్మాపురంలోని పీఏసీఎ స్‌కు 550 బస్తాల యూరియా తెప్పించారు. అలాగే అర్వపల్లి దుకాణాలలో కూడా యూరి యాను అందుబాటులో ఉంచారు. రైతులు యూరియా కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నామని మండల వ్యవసాయ అధికారి పెండోట గణేష్ తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

నూతనకల్ : మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లంజపెల్లి రమేష్, బత్తుల హరికృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం చిల్పకుంట్లలోని మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గతంలో ధర్నా చేసిన సమయంలో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఐదు నెలలు దాటినా ఇంకా వేతనాలు అందించలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు సకాలంలో అందించాలని కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.